# పండగ బట్టలు

పండగ తెల్లారి మనమన్ని వెంట తీసుకుని పార్కుకు వెళ్లిన. నాకంటె ముందే నారాయణ వచ్చి కూర్చుండు. అప్పుడె ప్రార్థన కోసం మజీదులో పిలుపు. మనమడు తన బంతితో ఆడుకుంటు వున్నడు.

"ఎట్లా గడిసింది పండగ" అడిగిండు నారాయణ.

పండగదేముంది ప్రతి సంవత్సరం వస్తుంది పోతుంది.

"అదే ఎట్లా పోయిందాంట" అన్నడు ముక్కు మీదికి జారిన కళ్ళద్దాలను సర్దుకుంటు నా వైపే చూస్తూ.

చెప్పుకోతగ్గ విశేషాలు ఏమిలేవు. ఏం పండగలు వెనుకటి పండగలా ఏమన్ననా ?

చిన్నపుడు పండగంటె ఎంతో సంబరముండేది పిండి వంటలు, కొత్త బట్టలు. ఏదో ఓ పండగకు కోడిని వండితె వాడంతా కమ్మటి వాసనొచ్చేది. ఇప్పుడు అట్లా లేనేలేదు, ఆ రోజులు రావు.

"ఈ రోజుల్లో కోడి కూర రుచే వుండడంలేదు" ఓ కాలును ఎత్తి బెంచి మీదుంచుతు అన్నడు.

"ఎప్పుడుపడితె అప్పుడు తింటుంటె ఏం రుచి వుంటుంది. ఈ బ్రాయిలర్స్ వచ్చినంక రుచి సంగతి ఎత్తనేవద్దు" అన్నడు నారాయణ.

ఇక పిండొంటల సంగతి. ఏ ఇంట్ల పని కట్టుకొని చేస్తుండ్రని, గల్లీకో స్వీటు సంటర్ వెలిసి అరిసెలతో సహా అన్నింటినీ అమ్ముతుండ్రాయే! ఇంక చేసుడెందుకు అయినా ఇప్పటోళ్ళకు ఆ ఓపిక ఎక్కడిది చెప్పు.

"అన్ని అంతే అయినయి పండుగలొస్తే ముఖ్యంగా దసరా వస్తుంది అంటే నెలరోజుల ముందే గుడ్డ తీసుకొని దర్జీకిచ్చి, తిరగంగా తిరగంగా పండగ రేపో మాపో అనంగ కుట్టిచ్చేది. వాటిని తెచ్చుకుని కొసలకు పసుపు రుద్ది పొద్దున్నే తొడుక్కునేది. ఇప్పుడు అట్ల పోయి, ఇట్లా రెడిమేడ్ తెచ్చుకుని జమ్మికెళ్లె ముందు తొడుక్కుని పండగ చేసుకుంటున్నరు. దేనికి ఎదిరిచూపులేదు, ఆలస్యం అసలులేదు.

కావల్సిందల్లా నోట్లే ! అవి వుంటె అన్ని కూచున్న చోటుకే వస్తుండే" అన్నడు వొచ్చే తుమ్మును ఆపుకుంటు.

అంతే అనుకో అంటు చుట్టూ చూసిన, రంగు రంగుల దుస్తులతో పిల్లలంత ఆడుకుంటున్నరు. మాకు కొంత దూరంలో మనమడు మను ఆడుకుంటున్నడు.

"అవును, పండక్కి బట్టలు తీయలేదా" అడిగాడు నారాయణ నా వైపే చూస్తు.

నవ్వి ఊరుకున్నాను. అప్పుడు నారాయణ చూపు మను మీదుంది. ఖరీదైన సూట్ వేసుకున్నడు. వాని శరీరపు తెల్లని రంగు కంటె కాస్త ముదురు రంగుసాక్స్ తొడిగి బ్రౌన్‌కలర్ బూట్లు వేసుకున్నాడు. మెడలో బంగారపు గొలుసు, వేలికి వుంగరం అందానికి తగ్గ అలంకరణ.

"నీ మనమడు జోరుగవుండయ్యా" అన్నడు ఓ సారి కనుబొమ్మలను కదిలిస్తు.

వున్నప్పుడు పైకి అందరు అట్లాగే వుంటరు ఎటొచ్చి లేనప్పుడే. 'సంపాదన వుంటె సంతమనదె' అని అంటరు గద.

"మీ వాడన్న మీకు బట్టలు తీయలేదా ?" అని అడిగాడు.

అప్పుడు నేను మను వైపు చూసాను. మను ఓచేత బాల్‌ను పట్టుకుని మరో చేత్తో తూనీగలను పడుతూనే వున్నడు.

చదువుకునే రోజుల్లో తప్ప ఉద్యోగంలో చేరినా ఏదసరా పండగకు నేనూ నా భార్య కొత్తబట్టలు వేసుకోవడం కుదరలేదు ఇప్పుడు అంతే.

"నీవు ఏం సంపాదించినవో, ఎట్లున్నవో గాని ఇప్పుడు మీ వాడు బాగా సంపాదిస్తున్నాడు గదా నీకు ఓ జత బట్టలు తెస్తె ఏంబోయింది చెప్పు. అవునులే ఏ ఇంట్లనయిన అంతె వుంది వాళ్లు కన్న పిల్లలకు జతలకు జతలు తెస్తరు. వాళ్లను కన్న వాళ్లకు మాత్రం" అని కాసేపు ఆగిండు అప్పుడు ఆయన కళ్ళల్లో తడి మెరిసింది.

నా మదిలో గతం కదిలింది ఆ రోజుల్లో అంతంతే జీతం. బతకలేక బడిపంతులు అనే మాటయితే నిజమే. ఆ రోజులు అట్లవుండే మొదట్లో నెలకు అరవై రూపాయలు. అన్నీ అందులోనె. మా ఆవిడ సంగతి నీకు తెలుసుగా ఒక్క రూపాయతో రోజెల్లతీసేది. రెండుమూడేండ్లు పండగలు లేవు వేడుకలు లేవు. నేను పనిచేసేది ఓచిన్న పల్లెటూరు. ఆ సంవత్సరం దసర పండగ పదో తారీఖుకొచ్చింది. జీతం వచ్చి వారం రోజులే. నేను నాడైనా నేడైనా జీతం తెచ్చి నా భార్యకిస్తూవుండేది. అవసరమొస్తె తిరిగి అడుక్కునేది. మూడేండ్ల సర్వీసు పూర్తిచేసిన వాళ్లకు ముప్పయి రూపాయల పండగ అడ్వాన్సు దొరికేవి. అవి తీసుకున్నాను. ఆ డబ్బుతో పండగకు ఓచీరె కొనుక్కో అన్న. అప్పుడామె నా ముఖంలోకి ఓరగా చూసి నవ్వింది.

'కొనుక్కో నిజం' అన్న.

'అట్లనా' అంటు అద్దంలోనూ చూసుకుంటు తిలకం దిద్దుకుంటు అద్దంలోను నా వైపు చూస్తు వుంది. ఆ రూపాయలు ఆమె చేతికిస్తూ, 'షాపుకు పోయి తెచ్చుకో' అంటు నేను కదిలి జగిట్లోని టేబుల్‌వైపు నడిచాను. ఆమె నా వెనకాలె వస్తూ 'మీరు చెప్పింది నేను విన్న మరి నేను చెప్పేది' అని అగి నావైపు చూస్తువుంది. నేను జగిలిదాటి బయటిదర్వాజవైపు నడుస్తువున్న వెనక నుండి వచ్చి చేయందుకుంది. 'బడిటైమైంది ఇప్పుడు కుదురదు' అన్న నవ్వుకుంటు.

'అబ్బో ఎంతాశ, అదేంకాదు. నామాట వినండి' అంది.

'చెప్పు' అన్నట్టు చూసిన.

'మనకు డబ్బు ఇబ్బంది వుందా ?'

'వుందీ' అన్నట్టు చూసిన.

'నేను కాపురానికొచ్చినప్పటినుండి చూస్తున్న మొదటి దసరాకు మావాళ్లు పెట్టిన బట్టలు తప్పా ఆతరువాత మీరు ఏ దసరాకు ఓ జత బట్టలుకొనుకోలేదు'

అయితె, నన్నేంచేయమంటవు మన పరిస్థితి /అట్లావుంది అంటు చిన్నబుచ్చుకున్నట్టు ముఖం తిప్పుకున్న.

ఇదే పరిస్థితి ఇంకా పదేండ్లున్న పరవాలేదు కాని మీరు చిన్నబుచ్చుకుంటె నేను వొప్పుకోను. ఓసారి నవ్వండి అంటు నా ముఖాన్ని తనవైపు తిప్పుకుని నా కళ్ళలో కళ్ళుంచి నవ్వింది. నేనుకూడ నవ్వకుంట వుండలేక పోయిన అదేమిటో ఎన్ని బాధలున్నా నా భార్య ముఖంలోకి చూస్తెచాలు అన్నీ మబ్బులు వీడిపోయినట్టే అని ఆగి నారాయణ ముఖంలోకి చూసిన, వింటుండాలేదా అని.

మను వైపు చూసిన వాడు ఇంకా తూనీగల పడుతూనేవుండు.

నారాయణ అప్పుడామె ఆ రూపాయలను నాచేతిలో పెడుతు –

'మీరే ఓ జత బట్టలు తెచ్చుకోండి, సరిపోతయి, అంది నా శర్ట్ కాలర్‌ను సరిచేస్తు నా కళ్ళలోకి చూస్తూ.

నీకు ఏ పండగకూ కొత్తబట్టలు తేలేదు. ఈసారి కొనుక్కో అన్న.

ఆమె నవ్వింది.

ఎందుకు నవ్వుతున్నావు అన్న

'ఎందుకంటె ఈ ఇంట్లో ఇద్దరమే వున్నం అని మీరనుకుంటున్నందుకు అంది' నేను ఏంమాట్లాడలేదు అట్ల నిలుచుండిపోయాను.

'మహానుబావా. నాకింకా అత్తమామవున్నారు. వాళ్లకు ఈసారి తీసుకో వచ్చే పండుగకు మనం –' తన ఎడమచేతి మీదున్న పచ్చను కుడి చేత్తో తాకుతూ ఆగింది. ఆ రోజుల్లో అత్త మామ అంటే అంతటి ప్రేమలు.

ఆ సంగతి నాకు గుర్తుంది కాని ఈసారి నీకు – అన్న.

'ముందువాళ్లకు తీసుకరండి. మన సంగతి తర్వాత ఆలోచిద్దాం' అంది. ఆ

డబ్బులు తీసుకుని, స్కూల్‌వైపు నడిచి, సాయంత్రం వచ్చేటపుడు అమ్మ నాన్నకు బట్టలు తెచ్చి టేబుల్ మీదుంచి, ఇదిగో సరు ఇవి ఎట్లున్నయోచూడు అన్న.

'మీరో జత తెచ్చుకుంటే బాగుండేది' అంది.

ఉన్న వరకు అక్కడక్కడికి సరిపోయినయి. అనుకుంటు బట్టలు మార్చుకుంటున్నపుడు.

'ఉద్దెరో సద్దెరో చూడకపోయింద్రా' అన్నది.

ఇవియే అప్పునాయె, ఇంకా అప్పా. వచ్చిన జీతం అప్పులకు కట్టిమరి తిండేవితిందాం అన్న.

'అది నిజమే' అంటు కొత్తబట్టలు విప్పిచూసి, మడతేసి పెట్టెలో పెట్టింది. సరోజకు ఇరవైలోనె ఇంత నిండైనా ఆలోచనలా అని ఆశ్చర్యపోయాను. ఆతరువాత దసరానాడు మా వూరు వెళ్లి పెద్దవాళిద్దర్కి కొత్త బట్టలు కట్టించి పాదాభివందనం చేసినం. అప్పుడు వాళ్ళు తమ చేత్తో మా తలలను తాకినపుడు ఏదో కొత్త శక్తి మా శరీరాల్లో చొచ్చుకొచ్చింది. అది అంతే.

ఆ తరువాత దీపావళి, సంక్రాంతి పోయి మళ్లీ దసరా వచ్చింది. అప్పుడూ పండగ అడ్వాన్స్ తీసుకున్నాను. ఈ పండగ అడ్వాన్సు కింద ఇచ్చే ముప్పది రూపాయలు ఏ ఒక్కర్కి చాలవు. అందుకని సరుకు ఇస్తూ ఈసారి నీవు బట్టలు తెచ్చుకో అన్న.

ఆమె నవ్వుతు నా దగ్గర్కొస్తు –

'రోజూ బడికివేల్లేటాయనకు, పదిమందిలో తిరిగెటాయనకు కావాల్నా లేక ఇంట్లో వుండేటోళ్లకు కావాల్నా ఆలోచించండి. బడిపిల్లలు ఏమనకుంటరు పంతులు ఎప్పుడు పాతబట్టలే వేసుకుంటడు, కొత్త బట్టలుకొననేకొనడు అనరా? పోతె ప్రతి సంవత్సరము పండగ అడ్వాన్స్ తీసుకుంటడు జత బట్టలు కూడ కొనుక్కోవు ఏమిటోయ్ అనరా మీ తోటి పంతుల్లు స్వామి. ఈ సారి మీరే కొనుక్కోండి అంటు వంటింట్లోకి నడిచింది.

నేను ఆలోచిస్తూ ఉండిపోయాను. అసలు ఇద్దరం పెండ్లయిన తరువాత ఏ దసరాకు కొత్త బట్టలు కొనుక్కోలేదు. ఇప్పటివరకు అవే పాతవే నడుస్తున్నయి. ప్రతి నెల వచ్చిన జీతం అమ్మా నాన్నలకు కొంత పంపినాక మిగతావి మాకే ఖర్చు గదా. ఆమె వంటింట్లో నుండి వస్తూ ఇంకా ఆలోచిస్తున్నారా. ముందు మీరు ఓ జత తీసుకోండి. నాకంటారా నేనోమాట చెపుత చేస్తారా? హైద్రాబాదు వెళితె అక్కడ పాత చీరెలు అమ్ముతరు గదా మనం ఎగ్జిబిషన్‌పోయినపుడు ఆ గేటు పక్కన చూసాంగా అదె ఆ మార్కెట్ దగ్గర, గప్‌చుప్‌గ ఓ పాత చీరె కొనుక్కురా, సరిపోతుంది అంది. చేటలో ఎల్లిపాయల పొట్టు తీస్తూ.

ఏందీ పంతులు భార్యకు పాత చీరా అన్న ఎందుకో నా మీద నాకే జాలేసింది.

ఏం చేస్తం కాసేపు అట్లా నిలుచుండిపోయిన.

"పిండికొద్ది రొట్టె. అయినా ఇది పాత చీరా, కొత్త చీరా అని ఎవరు చూడొస్తరు" అంది చాటలో నుండి చూపును నావైపు తిప్పుతు.

అది కాదు సరు ఊరివాళ్లు ఏమనుకుంటరు అన్న.

పాత చీరెకట్టుకుంటె పంతులు భార్యనుకానా? నేను చెప్పినట్టు చేయండి అంటు వంటింట్లోకి నడిచింది.

బస్ ఆ సంవత్సరం అట్లా గడిచిపోయింది. మరోసారి ఈ పండుగకు మీ చెల్లెను, బావను తీసుకొచ్చి సారె పెడదాం అంది అన్నట్టు చేసింది.

ఆ తరువాత సరు తల్లైంది. అదిగో వాని తండ్రి పుట్టాడు. బాలసారెకు అత్తగారు బట్టలు తెచ్చారు. కొడుకు పుట్టాలని కోరుకున్నాం కొడుకే పుట్టాడు కోరిక తీరింది. వానికి కొత్త బట్టలు, వగైరాలతో ఖర్చులతో బడ్జెట్ అయిపోయింది. అట్లా ఆ దసరా గడిచింది. ఆ తరువాత వానికి అన్నీ బాలారిష్టాలే.

అట్లా దసర పండుగలు వొస్తూ పోతూనే వున్నాయి, ఏ దసరా డాక్టర్లకు మందులకే బోలెడు ఖర్చయినయి. మొత్తానికి వాన్ని బతికిచ్చుకున్నం. కొత్త బట్టలు కొనుక్కునే వీలు పడలేదు.మా అబ్బాయికి మాత్రం ఒకటి రెండు జతలు తెస్తూ వుండేది. ముద్దు ముచ్చట పేర ఏండ్లకొద్ది వానికే తెస్తూ వుండేది. అందరు చేసే పనే నేను కాదనను ఎరికె తమ సంతానంపై అంత పిచ్చి ప్రేమ వుంటుంది. తిరిగి రాని ప్రేమ పిచ్చిదే కదా. కొడుక్కు పదేండ్లొచ్చినయి ఆరవతరగతిలో చేరిడు. తమ ప్రాథమిక పాఠశాల నుండి మాధ్యమిక పాఠశాలకు మారగ జీతం పెరిగింది. దానితో పాటు ఖర్చులు పెరిగినయి. ఉన్నంతలో మా ఆవిడ సంసారాన్ని చక్కగా నడిపిస్తు వస్తుంది. బాబు పుట్టిన తరువాత ఓ కూతురు పుట్టింది. ఖర్చులు రెట్టింపు పెరిగినయి. ట్యూషన్స్ చెప్పడం నాకు ఇష్టమైన పని కాదు. వచ్చే జీతంలోనె బతుకుతువచ్చినం. ఈలోపు అమ్మ నాన్న ఒకరి తరువాత ఒకరు కన్నుమూసినరు. అప్పటివరకు వాళ్ళకోసమన్నా పోతూ వుండేది. అది బంద్రై పోయింది. ఇంటి కప్పు కూలిపోయింది గోడలు మిగిలినయి. అవి వర్షాలకు తడిసి పైచాసో కరిగిపోయినయి. ఊరితో సంబంధం ఊడిపోయింది. అమ్మాయిని పెంచడంలో ఎక్కువ ఖర్చు రాసాగె. ఈలోగ బాబు యస్.యస్.సి. పాసు అయి ఇంటర్‌లో చేరె. ప్రతి పండుగకు ఇద్దర్కి బట్టలు తప్పవాయె. ఒక్క దసరాకేంది బడికి వెలుతుంటె ఇడవ – తొడగ నాలుగు జతలు కావల్సొచ్చె. అమ్మాయి పెండ్లికని అన్నొఇన్నొ పోస్టాఫీసులో వేస్తు రావడం జరిగే, ఇంటర్‌కొచ్చిన బాబును రెసిడెన్షియల్ కాలేజీలో వేయటం నెలనెలా, ఖర్చు బాగానే రాసాగే. ఆ తరువాత అత్తెసరు మార్కులతో ఇంటర్ పాసైన కుమారశేకరుడు బి.ఎ.లో చేరి ఇన్‌స్టాల్‌మెంట్స్‌ల్లో పాసాయె. అతి గారాభంతో చెడగొట్టిన అని తల్లి నా మీద

ఎగిరిపడేది. ఏ తండ్రి ఏ కొడుకును చదవద్దు అంటాడు నారాయణ. చదవాలన్న కోరిక వాళ్ళకుండాలి గాని అయినా వానికి కాలంకల్సొచ్చి గుమాస్తా ఉద్యోగం దొరికె. పెళ్ళిచేస్తి, పెళ్లైన ఆరునెలలకే కోడలు వేరు కాపురం కోరె. కొడుకు వంతపాడి కోరిక తీర్చుకొనిరి. పెన్షన్ డబ్బులతో అమ్మాయి పెళ్లిచేస్తి. ఆమె అత్తగారింట్లో తనకాపురం తాను చేసుకుంటువుంది. కొన్ని దసరాలు కొడుకుపాలాయె, మరికొన్ని బిడ్డపాలాయె ఏదసరా మాకోసం రాలేదు. అయినా మా పిల్లలు కొత్త బట్టలేసుకుని తిరుగుతువుంటె మేమే తొడుకున్నట్టుగ సంబరపడితిమి. మొన్న అరవైదాటినపుడు షష్టిపూర్తి చేసుకొమ్మన్నరు. మళ్ళీ ఏమనుకున్నరో చెల్లలు చేద్దమంటె అన్న మాట్లాడలేదట. ఈ మధ్య మా మిత్రుడొకాయన లేదు లేదు చేయాల్సిందే అని కాగితం మీద ఎట్టంగిసిండు. అన్నీనేనె చూస్తాను చేస్తాను అన్నడు. ఆఖరి రోజు వరకు ఆయన కూడ కనపడకుండాపోయిండు.

"కొందరంతె వాళ్లకు పూనకం వచ్చినపుడు గణాచిరి పలికినట్టు పలుకులు పలుకుతరు. పూనకం పోగానే అన్నమాటలను మరిచి పోతరు. వాళ్ళకు అయ్యేది మాటల ఖర్చేకద, పైసల ఖర్చేమన్న వుంటె అది నీ మీదకే తోస్తరు. అయితే ఇట్లా చాలమంది మనకు తారసిల్లుతుంటారు. చేసేది ఎంలేదు వాళ్ళను తప్పుకుని తిరగడమే" అన్నడు నారాయణ.

నేను నవ్వి ఊర్కున్నా. ఏం మాట్లాడలేదు.

ఉరుదులో ఓ సామెత వుంది నీకు తెలుసా దాని సారాంశమేమంటే నేను నా శత్రువుల నుండి తప్పుకోగలను కాని స్నేహితుల నుండి కాపాడు దేవుడా' అన్నాడట. అంటు మనం నమ్మని శత్రువుతో పేచి వుండదు. నమ్మిన స్నేహితుడే ఏమైనా చేస్తాడు సుమా. అన్నడు నారాయణ.

అనుభవాన్ని ఎవరు కాదంటరు.

"ఇంతకీ ఈ దసరాకు మీ అబ్బాయి మీకు ఏం తేలేదా" అని అడిగిండు.

తెచ్చాడు అంటు జేబులోని, పచ్చని ఆకు బయటికి తీసి చూపించిండు.

నారాయణ నవ్వి – "పాతికేండ్లు ప్రతి దసరాకు మనం వాళ్లకు కొత్త కొత్త బట్టలు తెస్తే, మనకు వాళ్లు –" అని ఆగిపోయాడు.

అప్పుడు నారాయణ కనుకొలుకులు తడి అయ్యాయి. నారాయణకు ఇద్దరు కొడుకులు ఓ బిడ్డ.

అవును నీవెందుకు బాధపడుతున్నావు. నీవు వేసుకున్నవి కొత్తబట్టలే కదా?

"కొత్త బట్టలే అమ్మాయి బెంగుళూరులో వుంటుంది కదా. పార్సల్లో పంపింది" అన్నడు పక్కకు చూస్తు.

నాకు అవి కూడ లేవు అనుకున్నాను. నా కళ్ళు ఏ మాత్రం తడి కాలేదు.

నామనస్సు ఎప్పుడో తడారిపోయింది. దసరా పదిరోజులుందనంగా సరోజ నా దగ్గర కూర్చోని మల్లెపూలు అల్లుకుంటు దసరా వస్తుంది సెకండ్ సేల్సుంటాయటగా చూడగూడదు అందికాని నాకు వెలగలేదు.

"ఒకడు నా పాత షర్ట్సు వేసుకోవచ్చు గద అంటాడు.

రెండవ వాడు బార్య చెప్పినట్టు వింటాడు. ఇంట్లో పెత్తనం ఆమె గారిదే. వానికి గూడ ఆమే బట్టలు కొనుక్కొస్తది. నా గురించిన ఆలోచనే ఆమెకు రానేరాదు." అవును వాళ్ళకు పాతికేండ్ల వరకు కొత్త బట్టలు కొనిపెడితే మనలను పాత బట్టల పాలుజేస్తరెందుకో అర్థం కాదు" అన్నడు.

నేను అదే ఆలోచిస్తున్న.

"చీకటి పడింది పదండి పోదాం" అంటూ లేచిండు.

నేను లేచి, మనుమని వైపు చూస్తు 'రమ్మని' సైగ చేసిన.

వాడు పరుగులాంటి నడకతో వస్తూ వుంటే గతం చీకట్లో కలిసిపోయింది.

• 2002